# అసహాయంకి హద్దులు

నీరసపు మొహంపెట్టి నిజం అని నమ్మించి ఏలాగైతేనేం ఆఫీసరు దగ్గర్నుంచి అరగంట పర్మిషను సంపాదించాడు సూర్యం. అయిదవకుండానే ఇంటికి పోతున్న ఆ అదృష్టవంతుణ్ణి చూసి ఫైళ్ళ పర్వతాల్లో కూరుకొనిపోయిన తోటి గుమాస్తాలంతా నిట్టూర్చారు. అందుకు సమాధానంగా విజయగర్వంతో కూడిన ఓ చిరునవ్వు విసిరి ఆఫీసు గడపదాటాడు సూర్యం.

ఆఫీసుదాటి రోడ్డుమీద పడడంఏమిటి, మామూలు నడకని ఓ చిన్నసైజు పరుగులోకి మార్చడం ఏమిటి, రెండూ ఒక్కసారే చేశాడు అతడు. వడివడిగా కిరాణా కొట్లూ, బట్టల దుకాణాలూ, కూరగాయల అంగళ్లు దాటి పోతున్న సూర్యాన్ని, మొగలో ఉన్న పువ్వుల జింగళ్ళు ఆపుచేశాయి. అంత వేగంలోనూ సడన్ బ్రేక్ వేసిన శకటం లాగ, చటుక్కున ఆగిపోయి, 'అప్పుడే మల్లెపువ్వులు

వచ్చేశావే!' అని కొంచెం బిగ్గరగా పైకే అనేసి అటు నడిచాడు సూర్యం.

బేరంఆడకుండానే కొనేసిన పువ్వుల పొట్లాన్ని పేంట్ జేబులో పెడుతూ, 'బాగా మురిపించి మురిపించికాని తను ఏం తెచ్చాడో రాధకి చెప్పకూడదు' అనుకున్నాడు సూర్యం అలా తను కాసేపు ఏడిపిస్తే, చెక్కిళ్లూ కళ్లూ ఎరుపెక్క, కోపంతో ముఖం అటుతిప్పేసే రాధ రూపం మెదడులో మెదిలేసరికి, సూర్యం పెదవులమీద ఓచిరునవ్వు వెలిసింది.

ఈ పాటికప్పుడే పుట్టిన రోజుకని స్పెషల్ గా నిన్న తను కొని తెచ్చిన ఊదారంగు ఉల్లిన్ చీరకట్టుకుని, ముస్తాబు రెడీగా ఉంటుంది. బహుశా వీధి గేటులోకి నిముషానికో పదిమార్లు అయినా వచ్చిచూస్తూ, తను వచ్చే జాడ ఇంకా కనుపించలేక పోయేసరికి రుసరుసలాడుతూ విసుక్కుంటూ ఉంటుంది. "ఆఁ!...ఈయనతో ఎప్పుడు సినీమాకి వెళ్ళినా ఇంతే! టైటిల్స దగ్గర్నుంచీ పిక్చర్ చూసేయోగం లేదు." అని కూడా అనుకుంటూ ఉంటుంది. రోజూలాగ కాకుండా తను ఇవాళ ప్రత్యేకంగా అయిదున్నర అవకుండానే ఇంటికి వస్తున్నానన్న సంగతి పాపం రాధకేం తెలుసు మామూలుగానే ఇవాళ కూడా ఆలశ్యంగా వస్తాను అనుకుంటూ ఉంటుంది.

ఇలా ఆలోచిస్తూ తొందర తొందరగా నడుస్తూన్న సూర్యం ప్రక్కలో, ఎవరో మోచేత్తో పొడిచారు. 'అబ్బ!' అని గట్టిగా ఒక్క మూలుగు మూలిగి, "ఏవయ్యా కొంచెం చూసుకోనక్కర్లే!" అన్నాడు సూర్యం.

"అదే నేనూ అందాం అనుకుంటున్నా ఇంత జనసమ ర్థంగా ఉన్న వీధిలోంచి వెళ్ళేటప్పుడు పరిగెత్తడమే కాకుండా పరధ్యానంగా కూడా ఉంటే ఎలా?" అంటూ వెటకారపు చూపు ఒకటి తన మొహాన్నకొట్టి వెళ్ళి పోయాడు అవతలివాడు.

మామూలు రోజునఅయితే అతనితో కజ్జాపెట్టుకొనే వాడే సూర్యం. కాని ఇవాళ టైటిల్స్ మొదలెట్టకుండా పిక్చర్‌కి వెళ్ళవలసిన ముఖ్యమైనరోజు, అర్జంటుగా వెళ్ళాలి. అందుకే ముఖం మాత్రం చిట్లించి ముందుకు నడిచాడు.

"అయినా ఈ ప్రజలకి బుద్ధిలేదు. ఏం కొంప మునిగి పోయిందని అయిదయే టప్పటికల్లా వీథుల్లోకి వచ్చిపడతారు? ఏదో అర్జంటుపని ఉన్నట్లు కంగారుగా ఇటూ అటూ నడ వడం, నిజంగా అర్జంటు పనిఉన్న, నా లాంటి వాళ్ళ కాళ్ళకి అడ్డాలు పడడం, మాటవరసకి నాపక్కలో నడిచి పోతున్న ఆ పెద్దమనిషికి అవతల ఏం రాచకారం తగలడి పోతోందని! అబ్బే - ఏం ఉండదు. అసలు నన్నడిగితే 'అర్జంటు పనిఉన్న ఏ సూర్యం లాంటి వాళ్ళోతప్ప తక్కిన వాళ్ళెవరూ సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో బయటకు రాకూ డదు' అని ప్రభుత్వం ఒక శాసనంచేస్తే బాగుండును. అలా చేస్తేకాని వీథుల్లో ఇలాంటి అనవసరమైన జనంయొక్క హడావడి తగ్గదు."

ఇలా ఆలోచిస్తూ గబగబా అడుగువేస్తున్న సూర్యా నికి అడుగడునా ఆటంకమే! రాసాగింది. వంకర టింకరగా నడుస్తూన్న మనుష్య సముదాయాలూ, అనుకోకుండా అడ్డు

వస్తూన్న సైకిళ్ళూ, రోడ్డు పక్క అజగరాల్లా ఆగిపోయి ఉన్న కార్లూ, ఇవన్నీ కలిసి కుట్రపన్ని, ఇవాళ ఎలాగైనా తనని పెందరాళే ఇంటికి వెళ్ళనియ్య కూడదని తీర్మానించుకున్నట్లని పించింది సూర్యానికి.

— ఆదరా బాదరాగా నడుస్తున్న ఆకంగారులోనే ఆదుర్దాగా వాచీ చూసుకున్నాడు సూర్యం. పన్నెండుని దాటుతూన్న పెద్దముల్లు, అయిదు అంకెమీంచి చల్లగా జారుకొంటూన్న చిన్న ముల్లుని తరుముతోంది. అమ్మో!... ఇలానడిస్తే ఇంక అయినట్టే అనుకొని ఓ రిక్షాని పిలిచి ఇంటికి బేరంఆడాడు. కానిఇంతలో, 'ఇంటినుంచిసినీమాహాలుకివెళ్లాగా ఇంకో రిక్షా కావాలికదా! మళ్ళీ ఆరిక్షాని చూసుకోవడం ఓ ఆలస్యమా' అనే ఆలోచన రావడంతో ఏకంగా ఇంటినుంచి సినీమాకి కూడా బేరం ఆడేసి అందులో కూచున్నాడు. రయ్ మని బయలుదేరిన రిక్షా అయిదున్నర అవకుండానే సూర్యం ఇంటిముందు ఆగింది.

రిక్షా దిగుతూ, "అటు తిప్పిఉంచు. అయిదునిముషాల్లో వచ్చేస్తా - అని రిక్షావాడికో హెచ్చరికచేసి, ఇటు తిరిగ చూశాడు. అనుకున్నట్టు రాధ వీధిగేటుదగ్గర కనిపించకపోయేసరికి సూర్యం కొంచెం నిరుత్సాహమే చెందాడు, కాని అమ్మగారికి బహుశా ఇంకా, చీర సింగారించడమే పూర్తి కాలేదేమో! సూర్యం నవ్వుకున్నాడు.

"రాధా!... రాధా ... టైమయిపోయింది. చప్పని...." అంటూ కేకేస్తున్న సూర్యం వీధిగది గుమ్మం దగ్గరకి వచ్చేటప్పటికి అగ్దోక్తితో ఆగిపోయాడు.

రాధ సినీమాకు బయలుదేరే ప్రయత్నంలో లేదు. ఓ సాదాచీర కట్టుకుని కుర్చీలో కూర్చుని సావకాశంగా ఎవరితోనో నవ్వుతూ కబుర్లు చెబుతోంది. ఆమెవేపే చూస్తూ, చెప్పే కబుర్లని శ్రద్ధగా వింటూ మంత్రముగ్ధులా ఈజీ చైర్‌లో ఓ పాతికేళ్ళ యువకుడు కూర్చున్నాడు.

అందమైన పచ్చని కోలముఖం, ముఖానికి వన్నె తెచ్చే నల్లని ఉంగరాల జుట్టూ, టెర్లిన్ షర్టూ పేంటూ, కాళ్ళకి ఎర్రని నైలాన్ సాక్సూ - ఎవరు చెప్మా అతనికేసే తెల్లబోయి చూస్తూ గడపదగ్గిరే ఆగిపోయిన సూర్యాన్ని చూసి, "వచ్చారా! రండి రండి, నేను ఇప్పుడే అంటున్నాను మీరు వచ్చేవేళ అయిందని" అందిరాధ. ఆ అందమైన ఆ అబ్బాయి ఇటు తిరిగి సూర్యాన్ని చూసి కుర్చీలోంచి లేవబోయాడు. కాని యింతలో "నువ్వు లేవడం ఎందుకు? ఆయనలా కుర్చుంటారులే" అంది రాధ. సరిగ్గా సినిమాకి బయలుదేరే సమయానికి వీడెవడు దాపురించాడోయ్!" అంటూ మనస్సులోనే విసుక్కుంటూ అలాగే గడపదగ్గరే నిలబడి పోయాడు సూర్యం. అతనక్కడే ఆగిపోవడాన్ని చూసి "అదేవిటి అలాగే ఉండిపోయారు! లోపలికి రండి" అంది రాధ.

"ఆ! వస్తాను రానూమరి? సమయానికి ఇలా అఘోరించకూడదనే బుద్ధి ఆ అబ్బాయికి లేకపోతేమానె-మేం సినిమాకి వెళ్ళాలి. ఇప్పుడు కాదు యింకోసారి దయచెయ్యి - ప్రస్తుతానికి వెళ్ళు. అని చెప్పి పంపించేబుద్ధి నీకయినా ఉండక్కర్లే? సావకాశంగా నవ్వుతూ వాడితో కబుర్లు చెపుతూ కూర్చుంటావా?"

ఇన్ని భావాలు తెలిపే ఒక తీక్షణమైనచూపు రాధ మీదకి విసిరేసి టేబిల్ దగ్గర్లో ఖాళీగా ఉన్న కుర్చీకేసి నడిచాడు సూర్యం. "అసలు ఎవడు వీడు? ముక్కూ-మొహం తెలియని ఈ అందమైన కుర్రాడితో రాధకి ఏమిటి కబుర్లు? అందులో నవ్వుతూ-పైగా తను యింట్లో లేని సమయంలో - సరదాగా సినిమాకని బయలుదేరుతున్న సందర్భములో - ఈ రాధకి బొత్తిగా మతిపోతుంది రోజు రోజుకీ-ఈ కుర్రాడు వెళ్ళిపోయిన తర్వాత గట్టిగా చివాట్లు పెట్టాలి" ఇలా అనుకుంటూ కుర్చీలో కుర్చోబోయి కసిగా నాకు మంచినీళ్ళు కావాలి" అన్నాడు సూర్యం.

"అవిగో - టేబిలుమీద ఉన్నాయి తీసుకోండి" అంది రాధ తనుకూర్చున్న కుర్చీలోంచి లేవకుండానే.

సూర్యానికి వళ్ళు మండిపోయింది రాధ చూపించిన అలక్ష్యానికి. ఏం అంత నిర్లక్ష్యంగా అనకపోతే లేచి గ్లాసులోపోసి ఇవ్వకూడదూ? రాధతోబాటు టేబుల్ మీద ఉన్న మరచెంబూ నీళ్ళూకూడా సూర్యానికి కోపం తెప్పించాయ్. వంటింట్లో ఏడవక ఈ మరచెంబు ఈ టేబుల్ మీదకివచ్చి అఘోరించడం ఎందుకు? ఆ చెంబులో నీళ్లు లేకుండా ఉంటే బాగుండు ననిపించింది సూర్యానికి. కాని తీరా చూస్తే నీళ్ళున్నాయి. సూర్యానికి చిరాకేసింది. "ఈ నీళ్ళనిండా నలకలే!" అన్నాడు.

"మీది మరీ విడ్డూరమండీ! ఇప్పుడే వడకట్టి తెచ్చిన నీళ్ళలోకి నలకలెలా వస్తాయి? అయినా మీ రిప్పుడు మంచి నీళ్ళు తాగకండి. నీళ్ళుకాగుతున్నాయి. అయిదునిమిషాలలో

కాఫీచేసి తీసుకు వస్తాను" అంది రాధ. సూర్యం చేసేది ఏంలేక ఆమెకేసి పుల్తూ పుల్తూ చూశాడు.

"అఁ! ఇంతకీ ఇతన్ని మీకు పరిచయమే చెయ్య లేదు..., ఇతనూ... అంటూ రాధ ఆ కొత్త వ్యక్తిని సూర్యానికి పరిచయం చేస్తుంటే, వీధిలోంచి" ఏవ డోయ్! ఆలస్యం అయిపోతోంది రావాలీ.... అంటూ రిక్షావాడు ఓ పొలికేక పెట్టాడు.

"ఏవండి - రిక్షా వాడికింకా డబ్బులు ఇవ్వలేదే మిటి?" అంది రాధ.

"ఏకంగా సినిమాకి వెళ్ళడానికి కూడా బేరం ఆడి ఉండమన్నాను" అన్నాడు సూర్యం.

"ఇప్పుడు సినిమాకి ఎలా వెడతాం? ఉండండి-డబ్బు లిచ్చేసి వాడిని పంపించేసి వస్తాను", అంటూ రాధ వెళ్ళి పోయింది.

ముందే సూర్యం ఇది ఊహించినాఁ తీరా "సినిమాకి వద్ద"ని రాధ అన్నప్పుడు మాత్రం, ఆమెమీద ఎక్కడ లేని కోపం వచ్చింది. "నాతోటి సినిమాకి రావడంగన్నా ఈ కుర్రాడితో మాట్లాడడం ముఖ్యం కాబోలు! ఛీ ఎంతయినా స్త్రీ బుద్ధి స్త్రీ బుద్దే!" అనుకుంటూ, ఆ అపరిచిత వ్యక్తి కేసి ఈర్ష్య అసహ్యం, కోపం ఈ మూడూ కలిపిన ఒక చూపు చూశాడు. సూర్యం తనవేపు విసిరిన చూపు సంగతే గమనించకుండా, తలవంచుకొని అవతల వ్యక్తి గోళ్లు గిల్లు కుంటూ కూర్చున్నాడు. ఇద్దరూ మౌనంగానే ఉన్నారు. ఆ నిశబ్దం ఇద్దరికీ ఇబ్బందిగానే ఉంది.

రాధ రిక్షావాడికి డబ్బులిచ్చేసి ఏకంగా, కాఫీలు కూడా పట్టుకొని గది లోపలికి వచ్చింది. సూర్యానికి కాఫీ చేదుగా ఉన్నట్లు అనిపించింది ఓ గుక్క తాగి "పంచదార" అన్నాడు.

"బోలెడు వేశాను. అందులో మీ కప్పులో మరీను. చెంచాతో కలుపుకోండి అంది రాధ. సూర్యానికి మరి మార్గాంతరం లేక పోయింది.

కాఫీ తాగడం మధ్యలో ఆపి "ఆఁ-ఇంతకీ ఇతనెవరో మీకు చెప్పనేలేదు కదూ ?" అంది రాధ సూర్యం కేసి చూసి.

అతనెవరో తెలుసుకోవాలని లోపల ఆసక్తి ఉన్నా, పైకిమాత్రం ఉదాసీనంగా ఉన్నట్లు నటించి ఇంకోపక్కకి చూస్తూ కాఫీ తాగుతున్నాడు. "ఇతన్ని మీ రెక్కడేనా చూచారా" అంది రాధ.

మరీఅంత నిర్లక్ష్యంగా ఉండడం పెద్దమనిషి లక్షణం కాదనుకొని సూర్యం ఆ కుర్రాడికేసి పరిశీలనగా చూసి ఒకొక్కక్క అక్షరాన్నే విడి విడిగా అంటూ "ఎక్కడో చూసినట్లు గుర్తు" అన్నాడు.

వెంటనే రాధ పకపకా నవ్వేసి తప్పట్లు కొడుతూ "అబద్దం - అతన్ని మీ రెక్కడా చూడలేదు. ఊరికేచూసి నట్లు నటిస్తున్నారు. అంతే!" అంది. అవతలవ్యక్తి కూడా రాధ అన్నమాటలతో ఏకీభవించునట్లు చిరునవ్వు నవ్వాడు. సూర్యానికి అవమానంతో తలకొట్టేసినంత పని అయింది. వచ్చిన కోపాన్ని పెదిమకీ పంటికీ మధ్యన బిగించాడు.

"ఇతను మా మేనమామ కొడుకు! మన పెళ్ళికి ముందే ఫారిన్ వెళ్లాడు, మళ్ళా వారంరోజుల క్రితమే మన దేశానికి తిరిగివచ్చాడట. అటువంటప్పుడు మీరితణ్ణి ఎక్కడ చూశారండీ!" అంటూ నిలదీసి ప్రశ్నించింది రాధ.

సూర్యం, రాధ ప్రశ్నని అసలు వినిపించుకోనేలేదు. అతను వేరే ఆలోచిస్తున్నాడు. మేనత్తకొడుకో మేనమామ కొడుకో, మొత్తంమీద వరసైన వ్యక్తే. అందుకే రాధ ఇతణ్ణి చూడగానే ఢిల్లా అయిపోయింది. తననీ, సినీమాకి వెళదాం అన్న ప్రొద్దుటిమాటనీ అన్నీ మరిచిపోయి ఎప్పుడూ లేని ఉత్సాహంతో ఇతనితో కబుర్లు చెబుతూ కూర్చుంది"

ఒళ్ళంతా కారం రాసుకున్నట్లూ, ఓముళ్ళకుర్చీమీద కూర్చున్నట్లూ అనిపించింది. సూర్యానికి. రాధని చూసినా, అనతలివ్యక్తిని చూసినా ఈర్ష్యా కోపం ఎక్కువ కాసా గాయి, అంతకంతకు తనలో పెరుగుతూన్న అసహ్యాన్ని చూస్తే సభ్యతని అతిక్రమించి, తనేమైనా అంటాడేమోనని భయపడ్డాడు సూర్యం. సూర్యం ఇలా తనలో బయలుదేరిన భావాల్ని అసూయనీ అణుచుకోలేక సతమతం అవుతూంటే - "ఇతని పేరు కృష్ణమూర్తి - చిన్నప్పుడు అంతా కిట్టూ అని పిలిచేవారు" అంది రాధ. ఆ కొత్తవ్యక్తి వేపు నవ్వుతూ చూసింది, అతనికేం జ్ఞాపకం వచ్చిందో మందహాసం చేశాడు.

ఇంక అక్కడ ఉండలేక పోయాడు సూర్యం లోపల బయలుదేరిన సంచలనాన్ని వీలైనంతవరకు ముఖంమీద కనిపించనీయకుండా "బట్టలు మార్చుకొని వస్తా" అంటూ లోపల గదిలోకి వెళ్ళాడు. పంచా, టవలూ ఇవ్వడానికి

రాధ తన వెనకాలే వస్తుందని ఊహించాడేమో, కాని ఆమె అలా రాకపోయేటప్పటికి సూర్యానికి మరీ కోపం ఎక్కు-వయింది.

"కృష్ణుడు - ఇంకనేం?... ఫష్టుగా సరిపోయింది. రాధా, కృష్ణుడూ-సిగ్గులేకపోతేసరి... అంతగా అతని మీదే మోజుంటే అతణ్ణే..."

గట్టిగా ఒక్కమారు నిట్టూర్చి, జేబులో ఉన్న మల్లె పువ్వుల పొట్లాన్ని అలమార్లోకి విసిరేసి, బట్టలు మార్చుకోకుండా ఆమట్టునే పందిరి మంచంమీద పడుకున్నాడు సూర్యం.

వెల్లకిలా పరుండి ఆలోచనా తరంగా 'ఉక్కిరిబిక్కిరి అవుతున్న సూర్యం చెవులకి అవతల గదిలోంచి రాధా కృష్ణుల కబుర్లూ, నవ్వులూ వినిపిస్తూనే ఉన్నాయి.

కథల్లోలాగ ఈ రాధాకృష్ణుడూ చిన్నప్పుడు కలిసి ఆడుకునే ఉంటారు. ఇద్దరిమధ్యా విడరాని స్నేహమే ఉండి ఉంటుంది. పెద్దవాళ్లుకూడా వీళ్ళస్నేహాన్ని ప్రోత్సాహించి ఉంటారు. ఇలా ఉండగా పెద్దవాళ్ళకీ పెద్దవాళ్ళకీ మధ్య వచ్చిన ఏవో పట్టింపులు కారణంగా రాధని తనకి నిర్ణయించడం, అది భరించలేక చదువువంకని మనశ్శాంతికోసమై కృష్ణుడు ఫారిన్ వెల్లడం జరిగిఉంటుంది, అవును. అంతే జరిగి ఉంటుంది. అవును అంతే."

ఇలా ఇష్టంవచ్చినట్లు ఆలోచిస్తున్న మెదడుని అదుపులో పెట్టుకోలేక; ఏక ఇదవు తున్నాడు సూర్యం. ఇంతలో "ఇదేమిటండీ - బట్టలు మార్చుకొని వస్తానని ఇంక ఇక్కడే

ఉండిపోయారు" అంటూ రాధ గదిలోకి ప్రవేశించింది. ముఖకవళికల్నిబట్టి తనలో రేగిన తుఫానుని ఎక్కడ కనిపెట్టేస్తుందో అనే కంగారులో నుదుటిమీద చెయ్యి వేసుకొని, గోడవైపుకి ముఖం తిప్పుకొని పడుకున్నాడు సూర్యం.

అదేవిటండీ! బట్టలు మార్చుకోకుండా అలా పడుకున్నారు. నుదుటిమీద చెయ్యి వేసుకొన్నారేం? తలనొప్పిగా ఉందా? అంది రాధ.

అప్రయత్నంగా "అవును" అన్నాడు సూర్యం.

"అయ్యో" అంటూ వచ్చి నుదుటిమీద చెయ్యివేసి చూసింది రాధ.

"చాల్లే నీనటన!" అని మనస్సులో అనుకొని, ఆమె చేతిని నుదుటి మీంచి నెమ్మదిగా తప్పించాడు.

"ఉండండి అమృతాంజనం తెస్తాను." అంటూ రాధ అలమారు దగ్గరకు వెళ్ళబోతుంటే కృష్ణుడు కంగరుగా ఇవతల గదిలోకి వచ్చి "ఏవిటి అన్నయ్యగారూ తలనెప్పి వచ్చిందా...ఏం?" అన్నాడు.

"ఏం ఏవిటి? సినిమాలానే!" పైకి అర్థం కాకుండా, నోట్లోనే గొణుక్కున్నాడు సూర్యం.

"పై అరలో ఉంది నీకు అందుతుందేమో చూడూ" అని రాధ పురమాయించడం ఏమిటి; వెంటనే జనరల్ యిచ్చే ఆర్డర్స్‌ని శిరసావహించే సోల్జర్స్‌లా కృష్ణుడు అమృతాంజనం సీసాతీసి రాధకి ఇయ్యడం ఏవిటి, రెండూ ఒక్కసారి జరిగాయి.

సీసా ఇచ్చేటప్పుడు వాడిచెయ్యి రాధకి తగిలిందా ? తగిలే ఉంటుంది-రామరామ - వీళ్ళెంత తెగించి పోయారు! తన కంటి ఎదురుగుండానే ఎల్లా ఉంటున్నారు! ఏం సీసా నేల మీద ఉంచకూడదు ? రాధ మాత్రం?... అలా అక్కడ ఉంచండి అనొచ్చుకదా? అలా మరీ చేతితో అంది పుచ్చుకోవడమా?" వద్దు అంటున్నా వినకుండా సుబ్బ రంగా నుదుటికీ; కనురెప్పలకీ కంఠానికి బాగా పట్టించి; "కాసేపు కళ్ళు మూసుకొని పడుకోండి" అని అనేసి రాధ "రా కృష్ణా! మాపెళ్ళి ఫోటోలూ అవీ చూపిస్తాను" అంటూ ఆల్బమ్ పట్టుకొని, అతనితో కలసి వీధి గదిలోకి వెళ్ళిపోయింది.

నిజంగా తలనెప్పి లేదేమో, ముద్ద ముద్దలుగా పట్టించిన అమృతాంజనం ముద్దతో కళ్ళూ మొహం కంఠం అంతా అగ్గి మంటలు ఎత్తి పోసాగాయి సూర్యానికి, ఓమూలని తన్నీ మంటతో చస్తూంటే అవతల ఆ పరసని ఏవిటా కేరింతాలు ? ఈ మంట బాధకి తోడు, అవతల గదిలోంచి రాధ అంటూన్న మాటలు సూర్యం హృదయంలో కొత్త మంటల్ని కొత్త బాధనీ రగుల్కొల్పాయి.

"అందరూ నువ్వన్నట్టే అన్నారు. కృష్ణా పెళ్ళిలో - కాని ఆయన మాత్రం నవ్వుతూ, నేనూ ఒప్పుకుంటున్నాను. అందంలో మీ రాధకీ నాకూ పోలిక లేదు. ఉన్న విషయాన్ని అంటే నాకు కోపం ఎందుకు?... పైగా మీరేం పైవాళ్ళని పొగిడారు కనకనా ?.. నేనూ అంటున్నా, రాధే అందమైంది అని అన్నారు"... 'రాధ ఇలా సమాధానం

చెప్పిందంటే కృష్ణ ఏం అని ఉంటాడు?' సూర్యానికి కృష్ణ మీాద పట్టలేనంత కోపం వచ్చింది. 'తన అందానికి నన్ను ఆక్షేపిస్తాడా? ఖరీదైన బట్టలు కడితేనూ, ముఖం పచ్చగా ఉంటేనూ సరా? అసలు మగాడికి అందం ఎందుకు ఆమాట కొస్తే? నా ఇంటికొచ్చి, నా అందం గురించి ప్రశ్నించడా నికి వీడికెన్ని గుండెలుండాలి. అసలు దీనికంతకీ ఆ రాధ ఇచ్చిన లోకువేకారణం దానికి నేనిచ్చిన లోకువ-హుఁ!"

ఇలా ఆలోచించి ఆలోచించి ఇంక ఊరుకోలేక 'రాధా!' అని గట్టిగా ఓ కేక వేశాడు.

ఆకేక విని కృష్ణా రాధా ఇద్దరూ ఉలిక్కిపడ్డారు రాధ మాత్రం గదిలోకి వచ్చి "ఏమిటండీ అలా కేకేశారు" అంది.

"నాకు అన్నంపెట్టు" అన్నాడు సూర్యం.

"అప్పుడేనా ?" అంది.

"ఏం ఇంకా వండలేదా?" అన్నాడు ఈ కృష్ణుడి ధ్యాసలోపడి ఇంకా వండి ఉండదనే నమ్మకంతో.

"వండకేవండి నాలుగు గంటలకే వండేశాను. ఇంత పెందరాళే ఏం భోజనం చేస్తారు అన్నా అంది.

ఇంతలోకృష్ణఆగదిలోకి ప్రవేశిస్తూ "పెట్టెయ్యి రాధా-అన్నయ్యగారికి పెందరాళే అలవాటేమో!" అన్నాడు.

తన ఇంట్లో, మధ్యన వీడిసిఫార్సు ఏమిటి బోడిసిఫార్సు తంటాంతఅన్నంత కోపం వచ్చింది సూర్యానికి.

“అసలీయనకి ఆలశ్యంగా తినడమే అలవాటు మరి ఇవాళ ఏమి వచ్చిందో! సరే రండి - మీకు వడ్డించేస్తాను. నేనూ కృష్ణా, తరువాత తింటాం” అంది రాధ.

“గొప్పపని చేస్తారు - ఇద్దరూ కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తిందాంఅనా?” అనుకొని సూర్యం- “అదే ఏటి? ఇంటికొచ్చిన అతిథినికాదని నేనుముందు తింటానా?... ఆయనకి కూడా వడ్డించు” అన్నాడు...

భోజనాలయ్యాక వీధిగదిలో కృష్ణకి మడతమంచం వేసి, గుమ్మానికి ఎదురుగా పడక గదిలో తను ఓ మంచం మీద పక్క వేసుకొందిరాధ. పడకగదిలోనే ఉన్న పెద్దమంచానికి పక్కగా, వీధిగదిలో గంట గంటన్నరసేపు కృష్ణా రాధా కలసి వాళ్ళ చిన్ననాటి కబుర్లూ, దేవుడిగుళ్ళో ప్రసాదాలూ, బడిలో మేష్టర్లు వడ్డించే పేక బెత్తపు దెబ్బలూ, పెద్దాళ్ళ ఆచారాలూ కుర్రాళ్ళ అల్లర్లూ, ఇవన్నీ కలగా పులగంగా చెప్పుకుంటూ మధ్య మధ్య నవ్వుకుంటూ, తను కూడా అక్కడో కుర్చీలో మౌనంగా కూర్చుని విని విని చివరకి విసుగొచ్చి “ఇంక నిద్దరపోకూడదూ?” అన్నాడు సూర్యం అందరికీ అర్థం అయేలాగ ఉమ్మడిగా.

“మీకు నిద్దర వస్తూంటే వెళ్ళిపడుకోండి పెద్దమంచం మీద పక్క వేశాను;” అని అధమపక్షం అతనికేసయినా చూడకుండా మళ్ళా కబుర్లలో పడిపోయింది రాధ.

“ఎంత నిర్లక్ష్యం! తనంటే ఎంత చులకనగా చూస్తోంది!... సరే ... సమయం రాకపోతుందా?...

నాలుగుమాటలూ అనేసి తను అవమానించలేదూ?...సరే...
కానియ్..."

అనుకుంటూ పడకగదిలోకి వెళ్ళిపందిరిమంచంమీద నడుం వాల్చాడన్న మాటేకాని ఆలోచనలు...ఆలోచనలు మెదడు వేడెక్కిపోతోంది, కంటికి కునుకు రావడంలేదు. పైగా అవతలగదిలోంచి వాళ్ళ కబుర్లు-వినలేకపోతున్నాడు వాళ్ళ కేరింతాలని - గుండెల్లో బల్లేలుపెట్టి పొడుస్తున్నట్లూ ఒంటిమీద తేళ్ళూ, జెఱ్ఱులూ పాకుతున్నట్లూ, అనిపిస్తోంది - అలా మెళుకువగా ఉండి వాళ్ళ కబుర్లు ఎంతసేపు విన్నాడో ... మనస్సులో పెట్టే ఎన్నితుఫాను హోరులని భరించాడో!

సూర్యం కళ్ళు తెరిచిచూసేటప్పటికి ఇల్లంతా నిశ్శబ్దంగాఉంది. గది అంతా పరచుకొనిఉన్న చీకటిని సాధ్యం అయి నంతవరకు తరిమెయ్యడానికి ప్రయత్నం చేస్తోంది బెడ్ లైట్. ఆ మసక వెల్తుర్లో చూశాడు. వీధిగదికీ మధ్యన ఉన్న తలుపుదగ్గిరగా వేసిఉంది! పక్కనఉన్న మంచంమీద రాధ లేదు!!

సూర్యానికి ఒక్కసారిగా రక్తప్రసరణ ఆగినట్లయింది. వెంటనే ఒంట్లో ఉన్న రక్తం అంతా ఒక్కమారు కోపంతో పొంగిపోయింది. ఆ గ్రహంతో వళ్ళంతా కనిపించి పోసాగింది. వెంటనే లేచివాళ్ళని కత్తైడైతే నరికెయ్యాలి అనుకొన్నాడు. ఉవ్వెత్తుగా లేవపోయాడు. ఇంతలో వెనకనుంచి గాజులు గలగలలాడుతూ ఓ మెత్తని చెయ్యి అతనిమీద పడింది. దాంతో సాయంత్రం తను తెచ్చిన

మల్లెపువ్వుల వాసనకూడా గుప్పునవీసింది. చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు.

ఆ చూపుతోనే తనని అప్పటిదాకా ఆవేశించి ఉన్న అసూయా ఆ గ్రహాలు కరిగిపోయా యన్న సంగతి తెల్లవారితే కాని తెలియలేదు సూర్యానికి.